AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN

26-3-2026 (Thursday) MAIN EDITION

## గోవా నుంచి మద్యం.. షాక్ ఇచ్చిన పోలీసులు



**అక్షరటుడే, హైదరాబాద్:** గోవా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వారికి పోలీసులు షాకిచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో దాడులు చేపట్టి రూ.2.5 లక్షల విలువైన 127 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. విమానాల ద్వారా గోవా నుంచి మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పహడీ షరీఫ్ వద్ద తనిఖీలు చేపట్టారు. పోలీసులు తనిఖీల్లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రెండు కేసులు నమోదు చేశారు.

## అమరావతికి చట్టబద్ధత కల్పించేలా తీర్మానం



**అక్షరటుడే, ఏపీ:** ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ భేటీ ముగిసింది. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ.. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్5ను సవరించాల్సిందిగా తీర్మానం చేసింది. అంతేకాకుండా నీరుకొండలో ఎస్ఆర్ఎం వర్సిటీ, 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణానికి కేబినెట్ అనుమతి ఇచ్చింది.

## 'ఇరాన్ సుప్రీంగా ఉండమన్నారు..'



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** యుద్ధం ముగింపునకు సంబంధించి అమెరికాతో చర్చలు జరగట్లేదని ఓవైపు ఇరాన్ చెబుతుండగా.. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ చర్చలు కొనసాగుతున్నట్లు చెబుతున్నారు. తాజాగా ఈ వ్యవహారంపై మరోసారి స్పందించిన ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనను ఇరాన్ సుప్రీంలీడర్‌గా ఎన్నుకొంటామని అన్నారంటూ ప్రగల్భాలు పలికారు.

## మిల్స్‌కాలనీ ఎస్సై సస్పెన్షన్



**అక్షరటుడే, వరంగల్:** వరంగల్ నగరంలోని మిల్స్ కాలనీ ఎస్సై సురేష్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సీపీ సన్‌ప్రీత్ సింగ్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై సురేశ్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి. భారీగా అవినీతికి పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. అంతేగాకుండా పలువురిని వేధించినట్లు సమాచారం.

## ఇరాన్ కీలక నేత మృతి



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇరాన్ గుప్పిట్లో ఉన్న హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఇజ్రాయిల్ మెరుపు దాడులు చేసింది. దాడిలో ఇరాన్ నేవీ చీఫ్ అలిరెజా తంగ్సిరీ మరణించినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రకటించాయి. ఇరాన్ సముద్ర తీర రక్షణ, హర్మూజ్ జలసంధిపై పట్టు సాధించడంలో అలిరెజా తంగ్సిరీ కీలక పాత్ర పోషించారు.



## బీఆర్ఎస్ సభ్యుల నిరసన

**అక్షరటుడే, హైదరాబాద్:** రిజర్వేషన్ల పేరిట బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ గద్దె దిగాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గురువారం ఉదయం గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలిపారు. అనంతరం అసెంబ్లీ వరకు ర్యాలీ నిర్వహించారు. బీసీ సబ్ ప్లాన్ అమలు ఏదంటూ నినాదాలు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా, బీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా ప్రభుత్వం మోసం చేస్తుందని మండిపడ్డారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## మధ్యాహ్న భోజనంలో చేపల కర్రీ

**అక్షరటుడే, హైదరాబాద్:** విద్యార్థులకు మంత్రి వాకిటి శ్రీహరి గుడ్ న్యూస్ చెప్పారు. మధ్యాహ్న భోజనంలో చేపలు కూర అందించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీలో ఆయన ప్రకటించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపల కూర అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బలమైన పశుసంపద ఉందని, గుడ్ల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ప్రతి యేటా చెరువుల్లో వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను వదులుతోందన్నారు. ఈ క్రమంలో చేపల ఉత్పత్తి సైతం భారీగానే ఉందని.. మధ్యాహ్న భోజనంలో చేపలు పెడతామని ప్రకటించారు.



# ఘోర రోడ్డు ప్రమాదం

### 13 మంది సజీవ దహనం
### బస్సు, టిప్పర్ ఢీకొనడంతో ఘటన
### దగ్ధమైన వాహనాలు
### పలువురికి తీవ్ర గాయాలు

**ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాయవరం సమీపంలోని పలకల క్వారీల వద్ద జరిగిన ఈ ప్రమాదం ఒక్కసారిగా విషాదాన్ని మిగిల్చింది. వేగంగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న కంకర లోడ్ టిప్పర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో రెండు వాహనాల్లోనూ మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 13 మంది సజీవ దహనం అయ్యారు.**
**–అక్షరటుడే, ఏపీ**

తెలంగాణలోని జగిత్యాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కనిగిరి హరికృష్ణ ట్రావెల్స్ బస్సు బయలు దేరింది. బస్సు ఏపీలోని మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలోకి చేరుకోగానే ప్రమాదం చోటు చేసుకుంది. కంకర టిప్పర్ బస్సు డీజిల్ ట్యాంక్‌ను ఢీకొనడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ప్రయాణికులు నిద్రలో ఉన్నారు. ఏం జరుగుతుందో అర్థం అయ్యేలోపే మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. దీంతో 13 మంది సజీవ దహనం కాగా.. పలువురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

#### కిటికీల నుంచి..

మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో బస్సు, టిప్పర్ పూర్తిగా కాలిపోయాయి. కొంతమంది ప్రయాణికులు కిటికీలు పగులగొట్టి బయటపడగా, మరికొందరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని వెంటనే మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది.

#### సీఎం దిగ్భ్రాంతి

మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు ప్రయాణికులు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి తగిన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆంధ్రప్రదేశ్ సీఎస్‌తో మాట్లాడారు.

#### పవన్ కల్యాణ్ విచారం

బస్సు ప్రమాద ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికిగల కారణాలపై జిల్లా అధికారులను ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు.

#### అతివేగమే కారణమా..

ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో వారి గుర్తింపు కష్టంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఒంగోలు ఎస్పీ ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. 13 మంది మృతదేహాలు వెలికితీశామని చెప్పారు. తీవ్ర గాయాలపాలైన 23 మందిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు. ఒకరిద్దరికి ఫ్రాక్చర్ తప్ప మిగతావారి పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

## ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేస్తున్నాం: సీఎం




**అక్షరటుడే, హైదరాబాద్:** ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బకాయిలను తాము పెండింగ్‌లో పెట్టలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన బకాయిలే ఉన్నాయని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం ఆరోగ్య శ్రీ పథకంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆరోగ్య శ్రీ బిల్లులు విడుదల కావడం లేదన్నారు. బిల్లులు ఇవ్వకపోవడంతో కార్పొరేట్ ఆస్పత్రులు మేజర్ సర్జరీలకు చికిత్స చేయడం లేదన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినా.. 496 మంది మాత్రమే లబ్ధి పొందారన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తామని ఆస్పత్రులు నోటీసులు ఇచ్చినా బిల్లులు విడుదల చేయడం లేదని ఆరోపించారు.

#### ప్రతి నెలా రూ.90 కోట్లు


సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద నెలకు రూ.90 కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పారు. పేమెంట్స్ ఇవ్వడం లేదని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.627 కోట్ల బకాయిలు బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి వచ్చాయన్నారు. అందులో రూ.240 కోట్లు ప్రభుత్వ ఆస్పత్రులకు, రూ.360 కోట్లు ప్రైవేట్ ఆస్పత్రులకు బాకీ ఉన్నట్లు వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చినప్పట నుంచి రూ.927 కోట్లు ప్రభుత్వ ఆస్పత్రులకు.. రూ.1,480 కోట్లు ప్రైవేట్ ఆస్పత్రులకు చెల్లించామని తెలిపారు.

## మళ్లీ మండనున్న ఎండలు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరగనుంది. వారం రోజులుగా అకాల వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడింది. దీంతో ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. గురువారం నుంచి ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం అంతటా నేటి నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో గురువారం 3941 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో ఈ రోజు 3839 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

## హర్మూజ్ నుంచి భారత నౌకలకు అనుమతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్‌కు ఇరాన్ గుడ్ న్యూస్ చెప్పింది. హర్మూజ్ జల సంధి నుంచి భారత నౌకలను అనుమతిస్తామని ప్రకటించింది. దీంతో అక్కడ చిక్కుకుపోయిన 20 నౌకలు త్వరలో భారత్‌కు రానున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసిన విషయం తెలిసిందే. దీంతో గల్ఫ్ దేశాల నుంచి ముడి చమురు, గ్యాస్ రవాణా నిలిచిపోయింది. ఈ క్రమంలో భారత్ ఇరాన్‌తో చర్చించడంతో కొన్ని నౌకలను అనుమతించింది. తాజాగా తమ మిత్ర దేశాల నౌకలను హర్మూజ్ జలసంధి నుంచి అనుమతిస్తామని ఇరాన్ ప్రకటించింది. భారత్ సహా చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ నౌకలను హర్మూజ్ జలసంధి నుంచి అనుమతిస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి గురువారం తెలిపారు.

## కల్తీ ఐస్‌క్రీముల తయారీ.. నిందితుడి అరెస్ట్

**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** నగరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఆహార కల్తీ చేస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. పాల నుంచి మొదలు పెడితే మద్యం వరకు దేనిని వదలకుండా కల్తీ మాఫియా రెచ్చిపోతుంది. నగరంలో ఇటీవల పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. ఆహార పదార్థాల కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం తనిఖీలు చేస్తూ.. కల్తీలకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేస్తున్నారు. అయితే అవి నకిలీవని తెలియడంతో ఇన్ని రోజులు ఆ ఆహార పదార్థాలు తిన్న వారు ఆందోళన చెందుతున్నారు. తాజాగా పోలీసులు కల్తీ ఐస్ క్రీమ్ తయారీ యూనిట్‌పై దాడి చేశారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన 'నయారా'




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ.. నయారా ఎనర్జీ సంస్థ నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. దీంతో ప్రైవేట్ చమురు సంస్థ నయారా ఎనర్జీ ఇంధన ధరలను పెంచింది. దేశంలో చాలా వరకు పెట్రోల్ బంక్‌లను ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వహిస్తున్నాయి. అయితే కొన్ని బంక్‌లను ప్రైవేట్ సంస్థలు సైతం నిర్వహిస్తున్నాయి. దేశంలో అతి పెద్ద ప్రైవేట్ ఇంధన రిటైలర్‌గా నయారా ఎనర్జీ కొనసాగుతోంది. ఈ సంస్థ తాజాగా పెట్రోల్ ధరలను లీటరుకు రూ.5.30 చొప్పున, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 చొప్పున పెంచింది. దేశంలో మొత్తం 1,02,075 పెట్రోల్ బంక్‌లు ఉండగా.. 6,967 పంపులను నయారా ఎనర్జీ నిర్వహిస్తుంది. పెరిగిన ముడి చమురు ఖర్చులలో కొంత భాగాన్ని వినియోగదారులపై మోపాలని నిర్ణయించుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది.

## కాటుక కళ్లతో మెస్మరైజ్ చేస్తున్న కియారా..



అందం, అభినయం, నటనతో పాన్ ఇండియా హీరోయిన్‌గా పేరుతెచ్చుకుంది. కియారా అద్వానీ. చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి ఫాలోయింగ్ సంపాదించింది ఈ అమ్మడు. ఒకవైపు ఈ సినిమాలు చేస్తూనే.. మరోవైపు ఇన్‌స్టా ఫాలోవర్స్‌ను పెంచుకుంటోంది. అందులో భాగంగానే బ్రౌన్ కలర్ లెదర్ డ్రెస్ ధరించిన ఈమె అందులో తన అందాలను ఆరబోస్తూ మెస్మరైజ్ చేసింది. తన బోసి నెక్‌కి డైమండ్ చౌకర్‌ను జత చేసింది. కాటుక కళ్లతో కుర్రకారుకు మత్తెక్కించేలా ఫొటోలకు ఫోజులు ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా కియారా అద్వానీ షేర్ చేసిన ఈ ఇంస్టాగ్రామ్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. **–అక్షరటుడే, సినిమాడెస్క్**